సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



ఇటుకబట్టీలో పనిచేయలేం..

ఇటుకబట్టీల్లో పనిచేయలేమని, తమను తమ ఇళ్లకు పంపించాలని వలన కూలీలు తహసీల్దార్, ఎస్సైకు మొరపెట్టుకున్నారు.

8లో▸



కాంగ్రెస్‌తోనే బతుకులు మారుతాయి

కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే పేదల బతుకులు మారుతాయని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/18.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
ఉక్కపోత పెరుగుతుంది.
గాలిలో తేమశాతం తక్కువ నమోదవుతుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి



మొక్కలు నాటుతున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

రామగుండం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. గురువారం రామగుండం, అంతర్గాం పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఆయనకు అంతర్గాం ఎస్సై సంతోష్ కుమార్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం నూతన అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. రామగుండం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ప్రాంగణంలో మొక్కలు నాటారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, రామగుండం సీఐ వై.చంద్రశేఖర్‌గౌడ్, రామగుండం ఎస్సై శరణ్య ఉన్నారు.

మంథని నుంచి మియాపూర్‌కు ఆర్టీసీ బస్సు



మియాపూర్ బస్సు సర్వీస్

మంథని: మంథని నుంచి హైదరబాద్‌లోని మియాపూర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభమైంది. ప్రతిరోజూ మంథని ఆర్టీసి బస్టాండ్‌లో రాత్రి పది గంటలకు బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్, జేబీఎస్ మీదుగా కూకట్‌పల్లి, మియాపూర్‌కు వేకువజామున మూడున్నర గంటలకు చేరుతుంది. అలాగే ఉదయం ఏడు గంటలకు మియాపూర్ నుంచి బయలుదేరి జేబీఎస్, కరీంనగర్ మీదుగా మధ్యాహ్నం 12.30వరకు మంథని చేరుకుంటుంది. మంథని నుంచి మియాపూర్‌కు.. అక్కడి నుంచి ఇక్కడకు రూ.440 టికెట్ ధర నిర్ణయించారు. మంథనితోపాటు పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి కూకట్‌పల్లి, మియాపూర్ ప్రాంతాల్లో ఎక్కువ మంది ఉద్యోగులు, విద్యార్థులు నివాసముంటున్నారు. మంథని నుంచి ప్రత్యేకంగా నడుస్తున్న మియాపూర్ బస్సు సర్వీస్‌తో ఎంతో సౌకర్యం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మంథని రెండో వంతెన ప్రారంభం



నూతన వంతెనపై రంగులు అద్దుతున్న సిబ్బంది

మంథని: మంథని డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేత శుక్రవారం వస్తున్నారు. మంథనిని ఆనుకుని ప్రవహించే బొక్కలవాగుపై రూ.5 కోట్లతో నిర్మించిన రెండో వంతెనను మంత్రి, ఎంపీ ప్రారంభించనున్నారు. అలాగే మంథని, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాల ప్రమాణస్వీకారంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ కొండ శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి కోరారు.

28న చలో హైదరాబాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఈనెల 28న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టామని, కార్మికులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, జీవో 51 సవరించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.కాజా, మండల గౌరవ అధ్యక్షుడు బానయ్య, అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, సంపత్, తదితరులు ఉన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సుల్తానాబాద్ మండలం నర్సాయపల్లిలో నిర్మించిన వైకుంఠధామం. ఇందులో బాత్రూమ్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు కల్పించారు. కానీ కరెంట్ సౌకర్యం లేకపోవడం.. ఊరికి దూరంగా ఉండటంతో ఇందులో అంత్యక్రియలు నిర్వహించడం లేదు. గ్రామంలో ఎవరు చనిపోయినా తమ పొలాలు, చెరువుల ప్రాంతాల్లో అంతిమ సంస్కారాలు పూర్తి చేస్తున్నారు.



ఈ చిత్రంలో గోడలు కూలిపోయి కనిపిస్తున్నది అంతర్గాం మండలం గోలివాడ సమీపంలోని గోదావరి నది ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం. ఇందులో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి.. వినియోగంలోకి తీసుకురాక ముందే గోడలు కూలిపోయాయి. ఫలితంగా ఎప్పటిలాగే గోదావరి ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

వసతులు లేవు.. నిర్వహణ కానరాదు..!

సొంత స్థలాలు, వ్యవసాయ భూముల్లోనే అంత్యక్రియలు పూర్తి

- నిరుపయోగంగా వైకుంఠధామాలు
- గ్రామ శివారుల్లో నిర్మించడంతో నామమాత్రపు వినియోగం
- వైకుంఠధామాల్లో ఇప్పటివరకు 927శవాలకు దహనసంస్కారాలు

జిల్లాలో వైకుంఠధామాలు ఇలా..	
మొత్తం	266
కరెంట్ లేనివి	93
ఫ్రీజర్స్ ఉన్నవి	09
వైకుంఠ రథాలు	12
రోడ్డు లేనివి	03



ఈ చిత్రంలో కనిపిస్తున్న వైకుంఠధామం రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లిలోనిది. దీనిని గతేడాదే పూర్తి చేశారు. వైకుంఠధామంలో మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ.. నీటివసతి, విద్యుత్ సౌకర్యం మాత్రం కల్పించలేదు. ఫలితంగా దీనిని ఇప్పటివరకు ప్రారంభించలేదు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం స్నానాల కోసం బావులు, పంపుసెట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

సాక్షి, పెద్దపల్లి: ఎంతటి వారైనా చివరకు చేరాల్సింది వైకుంఠధామానికే. అయితే సంప్రదాయబద్ధంగా జరగాల్సిన అంత్యక్రియలు మొక్కుబడిగా సాగకుండా చివరిమజిలీకి అనువైన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం.. ప్రతి గ్రామానికొక్కటి, మున్సిపాలిటీల్లోనూ అవసరాలకు అనుగుణంగా వైకుంఠధామాలు నిర్మించింది. అయితే వాటిలో వసతులు కల్పించకపోవడంతో అంత్యక్రియల సమయంలో బాధిత కుటుంబాలు తిప్పలు పడుతున్నాయి. చీకటిపడిన సందర్భంలో మొబైల్, టార్చిలైట్ల వెలుతురులోనే కార్యక్రమాలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వసతులు లేక నిర్వహణలోపంతో చాలాచోట్ల గతంలో మాదిరిగా వాగులు, చెరువులు, పొలాల పక్కన ఖాళీస్థలాల్లోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఆత్మీయులను కోల్పోయిన బాధను మరిచిపోయేందుకు.. బరువెక్కిన గుండెలు సేద తీరేందుకు ఆయా శ్మశానవాటికల చుట్టూ పర్యావరణం పెంచేలా చెట్లు, ఉద్యానవనాలు ఏర్పాటు చేశారు. వాహనాలు ఆగేందుకు పార్కింగ్ స్థలం దహనవాటికలు, అస్థికలు భద్రపరుచుగదులు, స్నానగదులు, మరుగుదొడ్లు నిర్మించారు. కర్మ, కేశ ఖండనాలు, పిండ ప్రదానాలు నిర్వహించేందుకు స్థలాలు చేశారు. శ్మశానం కాస్తా వైకుంఠదామంగా మారింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పటికీ గ్రామాల్లో కొన్నివర్గాల వారు వీటిని ఉపయోగించడం లేదు.

వసతుల లేమి ప్రధాన కారణం

జిల్లాలో 266 గ్రామపంచాయతీల్లో గ్రామానికో వైకుంఠదామం, ఇతర వసతుల కోసం కనిష్ఠంగా రూ.10లక్షల నుంచి రూ.12.60లక్షల వరకు ఖర్చు చేశారు. ఉపాధి హామీ నిధులతో 2020–21లో దాదాపు అన్ని పంచాయతీల్లో పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. వినియోగంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ వైకుంఠధామాల్లో 927మందికి మాత్రమే దహన సంస్కారాలు నిర్వహించారు. ఇంతకు రెండు రెట్ల మంది తమ సొంత స్థలాల్లోనే అంత్యక్రియలు పూర్తి చేసుకున్నారు.

అవగాహన కల్పించకపోవడంతో..

ప్రభుత్వం నిర్మించిన వాటిలో దహనసంస్కారాలు నిర్వహించేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కలిపించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో కుల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం వారివారి పంట పొలాల్లోనే ఖననం చేయడం.. లేదా దహనం చేయడం వంటివి ఎక్కువగా చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాం. కొన్ని చోట్ల సమస్యలు ఉన్నా వాటిలోనూ పూర్తిస్థాయిలో విద్యుత్, నీరు, తదితర సౌకర్యాలు కలిపించి వినియోగంలోకి తీసుకొస్తాం. పంచాయితీల్లో సర్పంచ్, పంచాయతీ పాలకవర్గంవారు ప్రజలందరూ వినియోగంచుకునేలా చూడాల్సిన అవసరం ఉంది. – చంద్రమౌళి, డీపీవో

రూ.15 కోట్లు ఇప్పించండి.. 8 ఏళ్లు నడిపిస్తాం



విద్యుత్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: బీ థర్మల్ విద్యుత్ కేంద్రానికి రూ.15 కోట్లు ఇప్పిస్తే ఎనిమిదేళ్లపాటు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని జెన్‌కో ఇంజినీర్లు స్థానిక ఎమ్మెల్యే కోరకంటి చందర్‌కు వివరించారు. విద్యుత్ కేంద్రాన్ని 2030వరకు నడిపించుకునేలా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) విద్యుత్ కేంద్రానికి ఉత్తర్వులు జారీ చేసిందని, అయితే 2014 తర్వాత విద్యుత్ కేంద్రాన్ని ఆర్అండ్ఎంకు అనుమతించకపోవడంతో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. నెల రోజులుగా బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిపివేశారని, నిర్వహణ వ్యయం పెరిగి విద్యుత్ యూనిట్ ధర రూ.6.30 నుంచి రూ.7కు చేరుతోందని, కాలం చెల్లిన బాయిలర్ ట్యూబ్స్, ఐడీ ఫ్యాన్స్ బేరింగ్స్, మిల్స్ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటే 55 నుంచి 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. తద్వారా విద్యుత్ యూనిట్ ధర రూ.ఐదుకు తగ్గుతుందన్నారు. ఈ నివేదికను బీ థర్మల్ కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.శంకరయ్య గురువారం కేంద్రం సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేకు అందించారు. ఐటీశాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో చర్చించి బీ థర్మల్ కేంద్రానికి తక్షణమే బొగ్గు, ఆయిల్ సరఫరా పునరుద్ధరించేలా చూస్తామని, సాంకేతిక సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీ థర్మల్ కేంద్రం సందర్శనకు త్వరలోనే కేటీఆర్‌ను ఆహ్వానిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, సలీంబేగ్, ఇంజినీర్లు డి.శంకరయ్య, కోలహలం శ్రీనివాస్‌రావు, డి.రవికుమార్, సంఘాల ప్రతినిధులు ఎండీ.సలీం, గుర్రం కుమారస్వామి, జహంగీర్ అహ్మద్, గుర్రాల నర్సింహులు, తాటిపల్లి కృష్ణమూర్తి, నజ్మీ, అబ్దుల్ తఖీ తదితరులున్నారు.

కార్పొరేట్ సంస్థకు దేశాన్ని అప్పగిస్తున్నారు..

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎస్.రాజ్‌ఠాగూర్



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థల దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగించాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీ చూస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి ఎంఎస్.రాజ్‌ఠాగూర్ విమర్శించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, అనేక పరిశ్రమలను ప్రయివేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని పేర్కొన్నారు. అదానీని ప్రపంచంలోనే రెండో స్థానానికి తీసుకొచ్చేందుకు ప్రధాని పనిచేస్తున్నారని వివరించారు. ఇతర దేశాల్లో ప్రధాని పర్యటించినప్పుడల్లా రెండు గ్రూపులకు పెద్ద ఎత్తున కాంట్రాక్టులు అప్పగించారని, ప్రజలకు ఇచ్చిన మాటలు ఏమైయ్యాయని, నల్లకుబేరులు ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. వీటిపై సమాధానం చెప్పకుండా ప్రశ్నించేవారిపైనే కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిని మరిచి.. అబద్ధాలతో ఇక్కడి ఎమ్మెల్యే కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తన పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే అనుచరులతో కలిసి విమర్శలు చేయిస్తున్నారని తెలిపారు. నాయకులు మహంకాళి స్వామి, ఎండీ.ముస్తాఫా, గట్ల రమేశ్, యుగేందర్, ఆసిఫ్, ధనుంజయ్, దశరథం, దూళికట్ట సతీశ్, గౌతమ్, సతీష్, నజీముద్దీన్, సిరిపురం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐసీతో అధిక ప్రయోజనాలు

సమాధానాలిచ్చిన ఈఎస్‌ఐసీ బ్రాంచి మేనేజర్ ఖగేశ్వరరావు

- సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాం
- 'సాక్షి ఫోన్ ఇన్'కు అనూహ్య స్పందన



జ్యోతినగర్: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)తో కార్మికులకు అధిక ప్రయోజనాలు కలుగుతున్నాయని, అర్హులైన కార్మికులు తమ సమస్యలను కార్యాలయ సమయంలో నేరుగాగాని, ఫోన్ ద్వారాగాని తెలియజేస్తే సత్వరమే పరిష్కరిస్తామని ఈఎస్ఐసీ రామగుండం బ్రాంచి మేనేజర్ ఖగేశ్వరరావు తెలిపారు. ప్రతినెల 15, 30వ తేదీలతోపాటు రెండో శుక్రవారం కార్మికుల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 27న ఈపీఎఫ్‌వో సంస్థ ఆధ్వర్యంలో 'నిధి ఆప్‌కే నికట్' కార్యక్రమాన్ని ఈఎస్ఐసీ, పీఎఫ్ సంయుక్తంగా కార్యక్రమం చేపట్టనుందన్నారు. ఫిర్యాదుల కోసం 08728–274602గానీ.. బ్రాంచి మేనేజర్ 08728–274505 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. గురువారం 'సాక్షి' ఫోన్‌ఇన్ ద్వారా పలువురి ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: డయాబెటీస్, థైరాయిడ్ మందులు ఆస్పత్రిలో అందించడం లేదు..?
– చిలుక శంకర్, కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బీఎం: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సంప్రదిస్తే సంబంధిత మందులను అందిస్తారు. రోగి పరిస్థితులను బట్టి అవసరమైన మందులను అందించేందుకు రెఫర్ చేస్తారు. ఈఎస్ఐ సీ–డీసీబీవోలో కూడా వైద్య సేవలు అందుతున్నాయి.

ప్రశ్న: మీసేవ కేంద్రంలో పనిచేస్తున్నాం. ఈఎస్ఐసీలో నమోదయ్యాం. కార్డు పొందడం ఎలా..?
– సందీప్, మీసేవ కేంద్రం, ఎన్టీపీసీ

బీఎం: టీఎస్‌టీఎస్ ద్వారా ఈఎస్ఐసీలో నమోదు అయ్యారు కాబట్టి ఆ ఆ చివరలో లాగిన్ అయి, ఇన్సూరెన్స్ పర్సన్ లేదా బెనిఫిషరీలో ఖాతా నంబర్, పుట్టిన తేదీని నమోదు చేయాలి. అనంతరం కార్డు పొందవచ్చు.

ప్రశ్న: మా పాప పేరు ఈఎస్ఐలో నమోదు చేయడం ఎలా..?
– సతీష్, ఖాజీపల్లి, ఎన్టీపీసీ

బీఎం: ఈఎస్ఐలో ఖాతా కలిగి ఉండి, కుటుంబసభ్యుల పేర్లను నమోదు చేయాలంటే సంబంధిత విధులు నిర్వహించే కాంట్రాక్టర్‌ను సంప్రదించాలి. వారు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మూడు రోజుల్లో పరిశీలించి ధ్రువీకరిస్తాం.

ప్రశ్న: ఈఎస్ఐ కార్డులు రెండున్నాయి.. ఒకటి చేయాలంటే ఎలా..?
– వెంకటేష్, ఎన్టీపీసీ

బీఎం: ఈఎస్ఐ రెండు కార్డులు ఉంటే వాటిని కార్యాలయానికి తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలి. రెండు కార్డులు ఉంటే ఉపయోగం ఉండదు. ఒకే నంబరుతో కార్డును చేసుకునేందుకు వివరాలతో కార్యాలయంలో సంప్రదించండి.

ప్రశ్న: మా పాపకు అత్యవసర వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాం. ఈఎస్ఐ ద్వారా ఆస్పత్రి ఖర్చుల బిల్లులు వచ్చే అవకాశం ఉందా..?
– నరేష్, కార్మికుడు, రామగుండం

బీఎం: అత్యవసర వైద్యం పొందిన విధానంతోపాటు ఆస్పత్రికి సంబంధించిన మందుల బిల్లులు, సంబంధిత ఆస్పత్రి వివరాలను ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సంప్రదించండి. సంబంధిత బిల్లులను పరిశీలిస్తారు. బిల్లులు మంజూరు కోసం సంబంధిత పత్రాలను అందించాలి.

నేడు రామగుండం మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి ఫోన్ ఇన్'



బి.సుమన్‌రావు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న కుక్కలు, కోతుల బెడదతోపాటు మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు దృష్టికి 'సాక్షి' తీసుకుపోయే అవకాశం కల్పిస్తోంది. ఆయనతో శనివారం 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బల్దియాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలను తెలుసుకోవచ్చు.

తేదీ:	సమయం:	సెల్ నంబర్:
24.02.2023	ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు	98499 05878

మార్చి వరకు సెంట్రల్ నర్సరీ పూర్తి చేయాలి

- హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీ పనులను, రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత

ధర్మారం: సెంట్రల్ నర్సరీ పనులు మార్చిలోగా పూర్తి చేయాలని, హరితహారం మొక్కలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సంగీత సూచించారు. మండలంలోని కొత్తూరులో గురువారం పర్యటించారు. సెంట్రల్ నర్సరీ పనులను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. నర్సరీ పనులపై అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం పనులకు బిల్లుల చెల్లింపులు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలన్నారు. ఎంపీడీవో జయశీల, అటవీ శాఖ అధికారి శివయ్య, ఎఫ్ఆర్‌ఓ సీహెచ్.స్వాతి, డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి, సర్పంచు మల్లేశం పాల్గొన్నారు.

సీపీఐ శ్రేణుల్లో జోష్

అల్గునూర్ నుంచి బైక్ ర్యాలీ

కరీంనగర్: సీపీఐ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి తొలిసారిగా వచ్చిన కూనంనేని సాంబశివరావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎర్ర చొక్కాలు ధరించి కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం గుండ్లపల్లి, రేణికుంట, నుస్తులాపూర్, అల్గునూర్ చౌరస్తాల్లో సీపీఐ కార్యకర్తలు రాష్ట్ర కార్యదర్శి కూనంనేనికి, పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డికి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. అల్గునూర్ నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో కూనంనేనితోపాటు చాడ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ వచ్చారు. కమాన్ చౌరస్తా వద్ద మహిళలు, డప్పు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షతన రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించారు. రాష్ట్ర నాయకులను జిల్లా పార్టీ పక్షాన గజమాలలతో సత్కరించారు. కూనంనేని సాంబశివరావు, చాడ మాట్లాడుతూ ఓట్లు, సీట్లు, అధికారం కోసం ఎర్రజెండా పుట్ట లేదని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, తాంద్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోశిక మోహన్, పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, కిన్నెర మలవ్వ, బీర్ల పద్మ, పైడిపెల్లి రాజు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు